క్వారీల్లో తనిఖీలు

కర్నూలు(అర్బన్), ఆగస్టు 17: నంద్యాల, కర్నూలు జిల్లాలోని పలు క్వారీలను గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సమక్షంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. డోన్ మండలం చిన్న మల్కాపురంలో డోలమైట్, వెల్దుర్తి మండలం కలుగోట్లలో ఎల్లో ఓకర్ మైనింగ్‌కు సంబంధించిన రెండు క్వారీలను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మురహరితో పాటు సిబ్బంది తనీఖీలు నిర్వహించారు. తమకు కేటాయించిన లీజు ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా తవ్వకాలు జరుపుతున్నారా? అనే కోణంలో పరిశీలించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డైరెక్టర్ హెచ్చరించారు.






మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరిన బ్రాహ్మణ కొట్టూరు ఎంపీటీసీలు

వైసీపీ కంచుకోట ఖాళీ...!

మొన్నటి వరకు నందికొట్కూరు నియోజకవర్గం వైసీపీకి కంచుకోట. దాదాపు పదేళ్లు ఆ పార్టీ హవా నడిచింది. కానీ మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరడంతో పరిస్థితి మారిపోయింది. వైసీపీలోని నాయకులంతా మూకుమ్మడిగా టీడీపీలో చేరుతున్నారు. బైరెడ్డి రాజశేఖరరెడ్డి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో వైసీపీ నాయకులంతా టీడీపీ కండువాలు కప్పుకుంటున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో వైసీపీ ఖాళీ కాగా, ప్రస్తుతం మండల స్థాయి నాయకులు కూడా వైసీపీని వీడుతున్నారు. దీంతో వైసీపీ నాయకులు పార్టీ కేడర్‌ను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. పదేళ్లుగా తాము చెప్పినట్లు నడిచిన వారంతా ఇప్పుడు పార్టీని వదిలేసి వెళుతోంటే ఏం చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారు. మొత్తానికి నందికొట్కూరులో 20 ఏళ్ల కిందటి టీడీపీ వైభవం మళ్లీ కనిపిస్తోందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరపడుతున్నారు.



- నందికొట్కూరులో సైకిలెక్కుతున్న వైసీపీ నాయకులు
- ఇప్పటికే భారీగా కౌన్సిలర్ల చేరిక
- టీడీపీ వైపు చూస్తున్న ఎంపీటీసీలు
- బేజారవుతున్న వైసీపీ నాయకత్వం

ఇక ఎంపీటీసీల వంతు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలాల్లో కూడా ఆ పార్టీ ఆధిపత్యమే కొనసాగింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను వైసీపీ కైవసం చేసుకుంది. నందికొట్కూరు మండలంలో 12 ఎంపీటీసీలకు గాను 4 ఎంపీటీసీ స్థానాలను మాత్రమే టీడీపీ గెలుచుకుంది. నియోజవర్గంలోని మిగిలిన 5 మండలాల్లో ఎంపీటీసీలు వైసీపీకి చెందిన వారే ఉన్నారు. ప్రస్తుతం మండల నాయకులు కూడా వైసీపీని వీడితేనే మంచిదన్న భావనకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో నెమ్మదిగా ఒక్కొక్కరు సైకిల్‌ను ఎక్కేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరుకు చెందిన ఇద్దరు ఎంపీటీసీలు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. దీంతో నందికొట్కూరు మండలంలో టీడీపీ ఎంపీటీసీ బలం 4 నుంచి 6కి పెరిగింది. అలాగే పాములపాడు ఎంపీపీ కూడా ఇప్పటికే టీడీపీలో చేరారు. ఇక ఇప్పటికే వైస్ ఎంపీపీ వైసీపీకి దూరంగా ఉన్నారు. ఆమెతో పాటు మరొకరు కూడా టీడీపీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

నంద్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి)/నందికొట్కూరు: గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నందికొట్కూరు మున్సిపాలిటీని వైసీపీ కైవసం చేసుకుంది. మున్సిపాలిటీలో మొత్తం 29 స్థానాలకు గాను వైసీపీ ఏకంగా 28 స్థానాలను గెలుచుకొని చైర్మన్ పీఠం కైవసం చేసుకుంది. ఇక టీడీపీ ఒక స్థానానికి మాత్రమే పరిమితమైంది. అయితే సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ టీడీపీ గెలవగానే పరిస్థితులు మారిపోయాయి. మున్సిపాలిటీ సమయం ఇంకా రెండేళ్లు ఉండటం, పైగా రాష్ట్రంలో టీడీపీ గెలిచి, వైసీపీ పూర్తిగా కుదేలైపోవటంతో ఇక్కడి కౌన్సిలర్లు పూర్తిగా ఆలోచనలో పడిపోయారు. దీనికి తోడు వైసీపీ ముఖ్య నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కూడా నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇక వైసీపీలోనే కొనసాగితే లాభం లేదని ఆ పార్టీ కౌన్సిలర్లు గ్రహించారు. పట్టణ అభివృద్ధి కోసమంటూ వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డితో సహా మరి కొంతమంది కొద్ది రోజుల కిందట బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తర్వాత వెంటనే మరో 11 మంది వైసీపీ కౌన్సిలర్లు మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. దీంతో ప్రస్తుతం నందికొట్కూరు మున్సిపాలిటీ టీడీపీలో బలం పెరిగిపోగా, వైసీపీ ఒకరిద్దరికి పడిపోయింది. రానున్న కాలంలో వీరు కూడా టీడీపీలో చేరతారన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇలా జరిగితే నందికొట్కూరు మున్సిపాలిటీ పూర్తిగా టీడీపీ పరమైనట్లే!

విలవిలలాడుతున్న వైసీపీ..

నందికొట్కూరు నియోజకవర్గంలో దాదాపు 20 ఏళ్లుగా టీడీపీ ఎదురుగాలి వీచింది. వైసీపీ ఆవిర్భవించకముందు కాంగ్రెస్, ఆ తర్వాత వైసీపీ ఇక్కడ గట్టి పట్టు సాధించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నందికొట్కూరుపై వైసీపీ గట్టి ఆశలే పెట్టుకుంది. అయితే స్థానికేతరుడికి టికెట్ కేటాయించడాన్ని ఆ పార్టీలోని వారు అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించారు. టీడీపీకి లోపాయికారిగా మద్దతు తెలపడం ప్రారంభించారు. దీనికి తోడు స్థానికుడైన గిత్తా జయసూర్య ప్రజల అభిమానం చూరగొని ఎమ్మెల్యేగా గెలిచారు. అంతేకాకుండా నందికొట్కూరు నియోజకవర్గానికే చెందిన డా.బైరెడ్డి శబరి కూడా నంద్యాల ఎంపీగా గెలిచారు. దీంతో ఇక్కడి వైసీపీ కేడర్ ఘనంగా తమ పార్టీ పేరు చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీనికి తోడు ఇటు జిల్లాలో, అటు రాష్ట్రంలో వైసీపీ పూర్తిగా గాలికి కొట్టుకుపోవటంతో స్థానికంగా గట్టిగా నిలబడి నాయకులకు, కార్యకర్తలకు మనోధైర్యాన్నిచ్చే నాయకుడు లేకుండా పోయాడు. పూర్తిగా దిశానిర్దేశం లేకుండా పోయిన వైసీపీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైందని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిప్రాయపడుతున్నారు.

పనులు చేయించుకునేందుకు..

గత ప్రభుత్వం హయాంలో దాదాపు పట్టణాల్లో, మండల, గ్రామస్థాయిల్లో పనులు సక్రమంగా జరగలేదు. ఇక జరిగిన పనులకు సంబంధించి బిల్లులు కూడా చాలా వరకు మంజూరు కాలేదు. ప్రస్తుతం వైసీపీ నామమాత్రంగా మిగిలిపోవటంతో ఆ పార్టీలో ఉంటే తమకు ఒరిగేదేమీ లేదని నాయకులు, కార్యకర్తలు ఓ అభిప్రాయానికి వచ్చారు. పైగా టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారి అభివృద్ధి జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో గతంలోని బిల్లులు మంజూరు కావాలన్నా, కొత్త పనులకు ఆమోదం జరగాలన్నా ఆయా స్థానిక సంస్థల్లో మెజారిటీ సభ్యుల ఆమోదం ఉండాలి. ఎలా చూసినా తాము పార్టీ మారితేనే మంచిదన్న ఉద్దేశంతో పార్టీ మారుతున్నారు. ప్రస్తుతం పార్టీ ఫిరాయింపులు నెమ్మదిగా జరుగుతున్నా, రానున్న కాలంలో ఈ ఫిరాయింపులు మరిన్ని ఉండే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు(ఫైల్)

ఏఈలు అందుబాటులో ఉండాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి



సూచనలు ఇస్తున్న ఎస్ఇ ఉమాపతి

నంద్యాల రూరల్, ఆగస్టు 17: ప్రతి మండల కేంద్రంలో విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి స్పష్టం చేశారు. శనివారం నంద్యాల డివిజన్ విద్యుత్ కార్యాలయంలో డీఈఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవరోదాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమస్యలను వెంటనే గుర్తించడం వల్ల ప్రమాదాలను నివారించడమే కాక ఆర్థిక నష్టాలను అధిరోహించవచ్చన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని పిలుపునిచ్చారు. సబ్సిడీపై ఇస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సోలార్ వినియోగానికి సంబంధిత అధికారులను సంప్రదించాలని పిలుపునిచ్చారు. నంద్యాల డివిజన్ పరిధిలో శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అక్కడ కొత్త ఉద్యోగులు వచ్చే వరకు ఇన్‌చార్జ్‌లే కొనసాగుతారన్నారు. స్థానికంగా మండల కేంద్రాల్లో లేని ఏఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నంద్యాల ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ, ఏఈలు రామయ్య, రవికుమార్, నాగరాజు, టెక్నికల్ ఏఈ కవిత, కమర్షియల్ ఏఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్పర్శ దర్శనం పునఃప్రారంభం

శ్రీశైలం, ఆగస్టు 17: శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు మల్లన్న స్పర్శ దర్శనాలను నిలుపుదల చేస్తూ భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పించాలని అధికారులు నిర్ణయించారు. భక్తుల కోరిక మేరకు ఈ నెల 18, 19 తేదీలో స్వామివారి స్పర్శ దర్శనాన్ని కల్పించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ రెండు రోజులు నిర్దిష్ట సమయాలలో నాలుగు విడతలుగా స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నారు. మొదటి విడత 6:45 నుంచి 8:30 వరకు, రెండవ విడత మధ్యాహ్నం 12 నుంచి 1:30 వరకు, మూడో విడత రాత్రి 8 నుంచి 9 వరకు, నాలుగో విడత రాత్రి 10 నుంచి 11:30 గంటల వరకు స్వామివారి స్పర్శ దర్శనం కల్పించనున్నారు. భక్తులు స్పర్శ దర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూ.డబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జి ద్వారా గంట ముందు వరకు కూడా పొందవచ్చు. అయితే ఈ రెండు రోజులు స్వామివారి గర్భాలయ, సామూహిక ఆర్జిత అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చనలకు అవకాశం లేదు.

నిలకడగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, ఆగస్టు 17: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 31,806 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 60,354 క్యూసెక్కులు మొత్తం 1,39,796 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 881.10 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 193.8593 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 31,303 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,681 క్యూసెక్కుల మొత్తం 68,984 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

కస్టోడియల్ డెత్‌పై 24న బహిరంగ విచారణ


ఆత్మకూరు, ఆగస్టు 17: ముచ్చుమర్రి బాలిక హత్య కేసులో నిందితుడు యోహాన్ అలియాస్ హుసేన్ కస్టోడియల్ డెత్‌పై ఈ నెల 24న బహిరంగ విచారణ జరపనున్నట్లు ఆత్మకూరు ఆర్డీవో మిరియాల దాసు తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముచ్చుమర్రి బాలిక హత్య కేసులో నందికొట్కూరుకు చెందిన యోహాన్ అలియాస్ హుసేన్‌ను నిందితునిగా చేర్చినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయం వద్ద బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో హుసేన్ మరణానికి సంబంధించిన ఏవైనా సాక్ష్యాలు, ఇతర సమాచారం ఉన్నట్లయితే తమకు ఇవ్వాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ఆత్మకూరు ఆర్డీఓ

11 మంది ఎస్ఐలు బదిలీ

కర్నూలు ఆగస్టు 17: ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల పరిధిలో పరిధిలో 11 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.



ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.లక్ష్మీనారాయణ	జూపాడుబంగ్లా	నంద్యాల త్రీటౌన్
ఎస్.సురేష్	వీఆర్, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
జి.శరత్ కుమార్ రెడ్డి	ముచ్చుమర్రి పీఎస్	కొత్తపల్లి
ఎం.కేశవ	ఎలక్షన్ సెల్, కర్నూలు	జూపాడుబంగ్లా
సి.శరత్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	ముచ్చుమర్రి
హెచ్.ఓబులేసు	వీఆర్, నంద్యాల	మిడ్తూరు పీఎస్
గంగయ్య యాదవ్	శ్రీశైలం టూటౌన్	నంద్యాల తాలుకా
పి.సలాంఖాన్	వీఆర్ నంద్యాల	నంద్యాల ట్రాఫిక్
ఎస్.మధుసూదన్ రావు	వీఆర్, నంద్యాల	నంద్యాల ట్రాఫిక్
దేవేంద్ర కుమార్	వీఆర్, నంద్యాల	నంద్యాల త్రీటౌన్
ఇ.కిరణ్ బాబు	వీఆర్, నంద్యాల	సీసీఎస్, కర్నూలు

ఆక్రమణల తొలగింపు

బనగానపల్లె, ఆగస్టు 17: బనగానపల్లె పట్టణంలో ప్రభుత్వ, ఎస్సార్బీసీ భూముల ఆక్రమణలపై టీడీపీ ప్రభుత్వం కొరడా ఝులిపిస్తోంది. ఇందులో భాగంగా శనిశారం తహసీల్దారు నారాయణరెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, గ్రామ వీఆర్వోలు, బనగానపల్లె సీఐ కృష్ణాయాదవ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆక్రమణలకు తొలగించడానికి నడుంబిగించారు. పట్టణ శివారులోని బొరుగుల బట్టీ సమీపంలోని విలువైన ప్రభుత్వ స్థలాలను 14 మంది ఆక్రమించారు. ఆరు నెలల క్రితమే వీరికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ఆక్రమణలను తొలగించారు. తహసీల్దారు నారాయణరెడ్డి మాట్లాడుతూ యనకండ్లకు చెందిన గడియారం సుబ్బరాయుడు అనే వ్యక్తి ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టామని తెలిపారు. పేదలకు బనగానపల్లె పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ప్రకారం స్థలాలు ఇవ్వడడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. బనగానపల్లె పట్టణంలో త్వరలో నాలుగు వేల మంది పేదలకు పట్టాలు ఇవ్వడానికి స్థలాలు కూడా గుర్తించామని వెల్లడించారు. రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 150 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. త్వరలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే వారికి ఇంటి పట్టాలతో పాటు గృహాలు మంజూరు చేయించనున్నట్లు తహసీల్దారు తెలిపారు.



ఆక్రమణల కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

కాలం చెల్లిన వస్తువులు ఎందుకు ఉన్నాయి?

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఎంపీ శబరి అసహనం

నందికొట్కూరు, ఆగస్టు 17: కాలం చెల్లిన వస్తువులను స్టోర్ రూమ్‌లో ఎందుకు ఉంచారని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని గాంధీ మెమోరియల్ పాఠశాల(బాలుర), బాలికల ఉన్నత పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ముందుగా గాంధీ మెమోరియల్ పాఠశాల(బాలుర) పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని తనిఖీ చేశారు. అక్కడ భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టోర్ రూంలో ఏఏ వస్తువులు ఉన్నాయంటూ తనిఖీ చేశారు. స్టోర్‌లో కాలం చెల్లిన బెల్లం ప్యాకెట్లను చూసి స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని బయట పడేయాలంటూ టీడీపీ కార్యకర్తలను ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు.



గాంధీ మెమోరియల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

- ప్రజలు నందికొట్కూరుకు వచ్చి తమ సమస్యలను ఎంపీకి విన్నవించుకున్నారు. దీంతో కొన్ని సమస్యలు ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని వినతి పత్రాలను ఆయా శాఖల అధికారులకు పంపారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి, మురళీమోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు, చాంద్‌బాషా, లాలుప్రసాద్, నాయకులు నాగేశ్వరరావు, గుణశేఖర్‌రెడ్డి, బంగారు వెంకటేశ్వర్లు, సాహెబ్‌ఖాన్, అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

కదంతొక్కిన వైద్యులు



ఆత్మకూరు సీహెచ్‌సీలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నంద్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిపివేసి నిరసన ర్యాలీ చేపట్టారు. వైద్యవిద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి కాసేపు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సభ్యసమాజం తలదించుకునేలా ఒక మహిళా వైద్యురాలిపై హత్యాచారం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు మినహా ఇతర సేవలను నిలిపివేయగా, మెడికల్ దుకాణాల యజమానులు తమ దుకాణాలను బంద్ చేశారు. అదే విధంగా ప్రజా సంఘాలు, ఆర్‌ఎంపీలు ఈ నిరసనకు మద్దతు తెలిపారు. నంద్యాల పట్టణంలో వైద్యులు, ప్రజా, విద్యార్థి సంఘాలు శనివారం ఉదయం ధర్నా చేపట్టాయి. సాయంత్రం వైద్యులు శ్రీనివాస సెంటర్ నుంచి మధుమణి నర్సింగ్ హోం వరకు ర్యాలీ చేపట్టారు. కోవెలకుంట్ల పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ర్యాలీ చేశారు. డోన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు కొత్తబస్టాండు ప్రధాన రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి పాతబస్టాండు వరకు భారీ నిరసన వ్యక్తం చేశారు. పాతబస్టాండులో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విధులను బహిష్కరించారు. విద్యార్థి సంఘాలతో కలసి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కొత్తబస్టాండు నుంచి పటేల్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఆళ్లగడ్డలో ప్రభుత్వ వైద్యులు అన్ని రకాల వైద్య సేవలను నిలిపివేశారు. వైద్యుల, సిబ్బంది స్థానిక ప్రభుత్వ వైద్యశాల నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు.


కోల్‌కతా ఘటనపై జిల్లా వ్యాప్తంగా నిరసన



నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యులు

సర్వపాప హరణం

రాఘవనామ స్మరణం





- ఉత్సవాలకు ముస్తాబైన శ్రీమఠం
- నేటి నుంచి 353వ సప్తరాత్రోత్సవాలు
- 22న స్వామివారి మహా రథోత్సవం
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- ఏర్పాట్లను పర్యవేక్షించిన పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

మంత్రాలయం, ఆగస్టు 17:

పవిత్ర తుంగభద్ర నదీ తీరంలో వెలసిన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మహిమాన్వితుడిగా మూలబృందావనం రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. నిత్యం వేదపండితులు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు భక్తులకు ఆహ్వానం పలుకుతున్నాయి. సంధ్యావేళల్లో వీచే చల్లని గాలులతో రాఘవేంద్రస్వామి నామస్మరణతో మంత్రాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. పుణ్యక్షేత్రంలో భక్తజనం ఆధ్యాత్మికత, ఆహ్లాదకరాన్ని పొందుతున్నారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఒడిస్సా, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచే కాక విదేశాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి ఆశీస్సులు పొందుతారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు లోకకల్యాణార్థం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మూలరాములకు నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న స్వామివారి 353వ సప్తరాత్రోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

రాఘవేంద్ర స్వామి జీవితచరిత్ర

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల ఆస్థానంలో ఉండే తమిళనాడులోని భువనగిరిలో తిమ్మనబట్టు, గోపమ్మ అనే దంపతులకు 1,595 సంవత్సరంలో మన్మథనామ సంవత్సరం పాల్గుణ శుద్ధ సప్తమి గురువారం రాఘవేంద్రస్వామి జన్మించారు. ఈయనకు వెంకటనాథుడని మొదటగా పేరు పెట్టారు. ఐదేళ్ల వయస్సులో విద్యాభ్యాసం ప్రారంభించి నాలుగు వేద అధ్యాయాలను చదివి సాటిలేని పాండిత్యాన్ని సంపాదించారు. పరిమళ వాఖ్యానంలో గెలుపొంది పరిమళాచార్యులుగా, 18రోజులుగా జరిగిన గ్రంధ పరిశోధనలో ద్రావిడ సన్యాసిని ఓడించి మహాభాష్యా పండితాచార్యులుగా, ద్వైత్వ సిద్ధాంతాలపై గెలుపొంది బట్టాచార్యులుగా బిరుదులు సంపాదించారు.

సన్యాసం స్వీకరణ

వెంకటనాథుడికి రాత్రి శ్రీరామచంద్ర ప్రభువులు స్వప్నంలో దర్శనమిచ్చి సన్యాసం తీసుకోమని ఆజ్ఞాపించారు. ఇందుకు అంగీకరించిన వెంకటనాథుడు ఒక రోజు రాత్రి భార్య పిల్లలను వదిలి తంజావూర్ రాజు రఘునాథుడి ఆధ్వర్యంలో 1623 సంవత్సరం పాల్గుణ శుద్ధ విదియనాడు మద్వాపీఠ సంప్రదాయాన్ని అనుసరించి ప్రత్యేక సన్యాసం స్వీకరించారు. ఈ సన్యాసం తీసుకున్న రోజు నుంచి రాఘవేంద్రతీర్థగా నామకరణం పొందారు. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి పట్టాభిషేకం మహోత్సవం మంత్రాలయంలో ప్రతి ఏటా వైభవంగా జరుగుతుంది.

బృందావనంలోకి ప్రవేశం..

1,671 శ్రావణ బహుళ విదియ గురువారం సూర్యోదయానికి ముందు మూల రాముడిని మనసారపూజించి ముందుగా ఏర్పాటు చేసుకున్న సమాధిలోకి సజీవంగా సమాధిపొందారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆగస్టునెలలో ఏడు రోజులు పాటు వైభవంగా నిర్వహిస్తారు. మంత్రాలయం మఠం ప్రధాన కేంద్రంగా దాదాపు వెయ్యికి పైగా బృందావనాలు వెలిశాయి. భారతదేశంలో దాదాపు 24 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా బృందావనాలు వెలిసి అనునిత్యం పూజలు జరుగుతున్నాయి. విదేశాలైన సింగపూర్, మలేషియ, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో సైతం బృందావనాలు వెలిసి నిత్య పూజలు అందుకుంటున్నారు.



దాత నిర్మించి విరాళంగా ఇచ్చిన గురునివాస్ భవనం

భక్తులకు ఏర్పాట్లు: ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకోసం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆదేశాలమేరకు ఏర్పాట్లను పూర్తి చేశారు. తాగునీరు, వసతి, భోజనం, పరిశుభ్రత, తుంగాస్నానం, ఆసుపత్రి, అంబులెన్సు, క్యూలైన్లు, వీఐపీలకు వసతి, దర్శనం, పరిమళప్రసాదం ప్రత్యేకకౌంటర్లు, వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం, మఠం ముఖద్వారాం, ప్రధాన రహదారులు, వసతిగృహాలను విద్యుత్ దీపాలతో శ్రీమఠం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏడురోజులపాటు జరిగే ఉత్సవాలకు ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలమేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ సోమన్న, సీఐ రామాంజులు, ఎస్ఐ గోపీనాథ్ ఆధ్వర్యంలో 300మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రముఖుల కోసం నిర్మించిన పద్మనాభ గెస్ట్ హౌస్

ఉత్సవాలు ఇలా..


18న ధ్వజారోహణం, గోపూజ, ఆశ్వపూజ, ధాన్యపూజ, సంస్థాన పూజలు
19న రజిత మంటపోత్సవం, శాఖోత్సవం
20న పూర్వారాధన,
21న మధ్యారాధన,
22న ఉత్తరాధన, మహా రథోత్సవం
23న సుజ్ఞానేంద్ర తీర్థుల ఆరాధన
24న సర్వ సమర్పణోత్సవంతో ఉత్సవాలకు ముగింపు

రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులు వీరికే...

మైసూర్ మహరాజ్ యదువీర్ కృష్ణ దత్త చామరాజ ఒడియార్, బీజీస్ గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ లార్డ్ ప్రకాష్‌నాథ్ స్వామీజీ, బెంగుళూరుకు చెందిన విద్యావన్ రఘుపతి ఉపాధ్యాయ, వారనాణాసికి చెందిన ప్రొఫెసర్ భూషన్ ఓజాలకు అవార్డులు అందజేయనున్నారు.



మ్యూజియంలో ఏర్పాటు చేసిన మఠం సమాచారం



భక్తులకోసం నిర్మించిన గెస్టుహౌస్‌ల సముదాయం

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయకండి

ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాము.గర్భిణీలు, బాలింతలు, వికలాంగులు, వృద్ధులకు శీఘ్రదర్శన ఏర్పాట్లు చేశాము. దుర్గ రమణ కల్యాణమండపంలో ఉచితంగా క్లాక్ రూం, లాకర్‌లు ఏర్పాటు చేసి బసచేసే సౌకర్యం కల్పించాం. ఉచిత వైద్యం, అంబులెన్స్ తాగునీరు, పరిమళ ప్రసాదం, క్యూలైన్లు, సర్వం సిద్ధం చేశాం.

-సుబుదేంద్ర తీర్థులు, పీఠాధిపతి,
రాఘవేంద్ర స్వామి మఠం, మంత్రాలయం



39 మంది సీఐలు బదిలీ

కర్నూలు ఆగస్టు 17: కర్నూలు రేంజ్ పరిధిలో 39 మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 23 మంది కాగా, అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో 16 మంది సీఐలు బదిలీ అయ్యారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.శేషయ్య	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య	కర్నూలు వన్‌టౌన్ (అటాచ్డ్ సీసీఎస్)
జి.నిరంజన్ రెడ్డి	కర్నూలు వన్‌టౌన్ (అడిషినల్ పోస్టు)	వీఆర్, కర్నూలు
జి.శంకర్ మల్లయ్య	ఎస్సీ ఎస్టీ సెల్, అన్నమయ్య	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, కర్నూలు
ఎం.నాగ శేఖర్	ఓర్వకల్లు అవుట్‌పోస్టు, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
ఎం.శ్రీనాథ రెడ్డి	పీసీఆర్ ఆదోని, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సైబర్ సెల్, అన్నమయ్య జిల్లా
కె.జయరాములు	డీసీఆర్‌బీ, నంద్యాల	పీసీఆర్, నంద్యాల
ఎ.ఓబులేసు	పీసీఆర్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
కుచల శ్రీనివాసులు	వీఆర్, కర్నూలు	సీసీఎస్-1 నంద్యాల
టి.శ్రీధర్	సైబర్ సెల్, చిత్తూరు	సీసీఎస్-1 (క్యాన్సిల్)
జి.నిరంజన్ రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్-2 నంద్యాల
వి.ప్రభాకర్ రెడ్డి	సీసీఎస్-2, నంద్యాల	ఫ్యాక్షన్ జోన్, నంద్యాల
కె.మోహన్ రెడ్డి	వీఆర్, కర్నూలు	సీసీఎస్-3 నంద్యాల
జి.యువరాజు	వీఆర్, అన్నమయ్య	ఎస్సీ, ఎస్టీ సెల్, నంద్యాల
జి.ప్రియతమ్ రెడ్డి	వీఆర్ఎస్‌పీ, నంద్యాల	సైబర్ క్రైమ్, నంద్యాల
ఎ.ఆదినారాయణ రెడ్డి	వీఆర్, కర్నూలు	డీటీసీ, నంద్యాల
పి.సురేష్ కుమార్	సీసీఎస్, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
జె.రమేష్ కుమార్	వీఆర్, నంద్యాల	దిశా-1 నంద్యాల
ఆర్.ఈశ్వరయ్య	వీఆర్, కడప	దిశా ఉమెన్-2 నంద్యాల
కె.ఎరిషావలి,	వీఆర్, కర్నూలు	ఎస్‌బీ-2 నంద్యాల
బీవీ చలపతి	వీఆర్, నంద్యాల	ఎస్‌బీ-3 అన్నమయ్య
పి.శంకరయ్య	వీఆర్, కర్నూలు	ఆర్ఎస్‌టీఎఫ్ అన్నమయ్య (క్యాన్సిల్)
టి.నరసింహులు	వీఆర్, నంద్యాల	ఆర్ఎస్‌టీఎఫ్, అన్నమయ్య

పెళ్లింట విషాదం

గోనెగండ్ల, ఆగస్టు 17: పొద్దు పొడిస్తే ఇ ఇంట పెళ్లి. అంతవరకు సంబరంతో అంతా తానై పెళ్లి పనులు చేశాడు. వంట సరుకులు తీసుకువచ్చేందుకు గంజహళ్లి గ్రామం నుంచి గోనెగండ్లకు బైక్‌పై బయలుదేరాడు. ఎల్లెల్సీ మలుపు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గంజహళ్లి గ్రామానికి చెందిన దరగయ్య(35) కూలి పనులు చేసి జీవనం సాగించేవాడు. ఆదివారం మేనళ్లుడి పెళ్లి నిశ్చయించారు. దీంతో దరగయ్య సరుకులు తీసుకు వచ్చేందుకు శనివారం బైక్‌పై గోనెగండ్లకు బయలు దేరాడు. గోనెగండ్ల సమీపంలోని ఎల్లెల్సీ దగ్గర రాగానే గోనెగండ్లకు చెందిన జీనియస్ గ్లోబుల్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. దీంతో దరగయ్య రోడ్డుపై ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు డ్రైవర్ కందనాతి షేక్ మాబువలి అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న దరగయ్య కుటుంబ సభ్యులు, పెళ్లికి వచ్చిన బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని కన్నీమున్నీరయ్యారు. దరగయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భార్య బాలక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 17: కర్నూలు జిల్లా స్పోర్ట్స్ సెలక్షన్స్ స్కూల్ అవార్డుకు ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా ప్రధానోపాధ్యాయులకు, వ్యాయామ ఉపాధ్యా యులకు జిల్లా విద్యాశాఖ అధికారి శనివారం తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఫైవ్‌మెన్ కమిటీ పరిశీలించిన తర్వాత అత్యధిక స్కోరు వచ్చిన పాఠశాల వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబందిత ధ్రువీకరణ పత్రాలతో ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

లారీ, ట్రావెల్ బస్సు ఢీ..

- బస్సు డ్రైవర్ మృతి
- లారీ డ్రైవర్లకు స్వల్ప గాయాలు

డోన్(రూరల్), ఆగస్టు 17: లారీ, ట్రావెల్ బస్సు ఢీకొని బస్సు డ్రైవర్ మృతి చెందాడు. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డోన్ పట్టణం సమీపంలోని మ్యాక్స్ ఫోర్ హోటల్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పట్టణ పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి ఖమ్మం వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్ బస్సు డోన్ హైవే మీదుగా వస్తూ డివైడర్‌ను దాటుకుని హైదరాబాదు నుంచి సేలంకు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సతీష్ కుమార్ (28) అక్కడికక్కడే మృతి చెందాడు. లారీలో ఉన్న డ్రైవర్లు ముత్తుస్వామి, చిన్న స్వాములకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రావెల్ బస్సులో 22 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు, లారీల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. లారీలో ఇరుక్కున్న డ్రైవర్లను పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసులు క్రేన్ సహాయంతో బయటకు తీసి వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా క్రేన్ సాయంతో లారీ, బస్సులను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆరెంజ్ బస్సు డ్రైవర్ సతీష్ కుమార్ తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా నందమర్రి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన లారీ



దెబ్బతిన్న ట్రావెల్ బస్సు ముందు భాగం

పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

నంద్యాల టౌన్, ఆగస్టు 17: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్‌లో రైతులు పంటలను సాగు చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ అన్నారు. శనివారం ఆర్ఏఆర్ఎస్‌లో ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ, ఆర్ఏఆర్ఎస్ సంయుక్త నిర్వహణలో శిక్షణ, సందర్శన (టీ అండ్ వీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో శనగ సాగు చేసే రైతులు కొర్ర, మినుము, సోయాబీన్ లాంటి పంటలు కూడా పండించి అధిక దిగుబడులు, అధిక ఆదాయం పెంచుకోవచ్చన్నారు. రైతులు శనగ పంటకు ముందు ఎలాంటి పంటలు విత్తని పక్షంలో భూమిలో ఉష్ణోగ్రత్త పెరగడం, నేలలో తేమ శాతం తగ్గడం జరుగుతాయన్నారు. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పంటలు పండించే సమయంలో భూముల సాంద్రతను బట్టి ఏ పంటలు అనుకూలమో ఆ పంటలను సాగు చేయాలని సూచించారు. కర్నూలు జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటల సాగు, వాతావరణ పరిస్థితుల ప్రభావం తదితర అంశాలను వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు మాట్లాడుతూ వివిధ పంటల్లో తెగుళ్ళ నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, పత్తిలో గులాబీ రంగు పురుగుల నివారణ చర్యలను వివరించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ నీలిమ, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ఏఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 17: జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న పోరాటాలు అభినందనీయమని, జర్నలిస్టులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హామీ ఇచ్చారు. శనివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ వార్షికోత్సవం పురస్కరించుకుని నగరంలోని వెంకటరమణ కాలనీలో ఉన్న కీర్తన అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఏపీయూడబ్ల్యూజే పతాకాన్ని యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్‌పీ సుబ్బయ్య ఆవిష్కరించగా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పిల్లల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం శరణాలయం పిల్లలకు ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మీడియాకు మంచి ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజలకు, పాలకులకు మధ్య వారధిగా ఉంటూ సమాజంలో వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. అలాగే జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషి కూడా అభినందనీయమని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియాకు స్నేహితుడని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం ఆయనతోనే సాధ్యమన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజేయూ నాయకులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవ సలహాదారు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎస్ రాజు, కే శ్రీనివాసగౌడ్, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, సీనియర్ నాయకులు హుస్సేన్, మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శులు శివరాజ్‌కుమార్, వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, నాయకులు ఎం. శ్రీనివాసరాజు, నాగప్రసాద్, మురళి, వీడియో జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్నేహాల్, ఎల్లాగౌడ్, శేఖర్, నాగేశ్, సురేశ్, గంగాధర్, రఫీ, కీర్తన అనాథ శరణాలయం నిర్వాహకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి

ఆదోని రూరల్, ఆగస్టు 17 : ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ బోయ వెంకటేశులు(27) మృతి చెందాడు. ఆదోని మండలం బైచిగేరికి చెందిన బోయ వెంకటేశులు ఆదోనిలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. శనివారం పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని లారీ బైచిగేరి సమీపంలో ఢీకొంది. దీంతో వెంకటేశులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేశామని తాలుకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన బోయ గిడ్డయ్యను ఇన్సీ పోలీసులు అరెస్టు చేశారు. కర్ణాటక మద్యం తరలిస్తుండగా అదుపులో తీసుకున్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నాణ్యమైన విత్తనాలు అందించాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, ఆగస్టు 17: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల అందించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్లను ఆదేశించారు. పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నందికొట్కూరు మండలం విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అదే పంథాలో టీడీపీ హయాంలో నకిలీ విత్తనాలు అమ్మితే సహించబోమన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇచ్చి రైతులకు మేలు చేయాలన్నారు. మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. అనంతరం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల సంఘం నాయకులు గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఏవో షేక్షావలి, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, చిన్నరాజు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు గౌరీశ్వర్‌నాయుడు, అచ్చెన్న, లక్ష్మన్న, రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు: డీఎంహెచ్‌వో



రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

బండిఆత్మకూరు, ఆగస్టు 17: వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. మండలంలోని నారాయణపురం గిరిజన ఆసుపత్రితో పాటు బరకల కాలనీలో ఇమ్యునైజేషన్, పెద్దదేవళాపురం గ్రామంలో 104 వైద్య శిబిరాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్రామీణ వైద్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది సక్రమంగా సమయానికి లేకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. వ్యాధిగ్రస్థులతో వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. వేళకు విధులకు రావాలని ఆదేశించారు. వెంట డాక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

వీపనగండ్లలో 'పొలం బడి'



విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మిడుతూరు, ఆగస్టు 17: మండలంలోని వీపనగండ్ల గ్రామంలో వ్యవసాయ అధికారి పీరునాయక్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా రైతుల పొలాల్లో భూసార పరీక్ష, విత్తనశుద్ధి పట్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ మట్టి నమూన సేకరించి భూసార పరీక్షలు చేయడం వల్ల రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. విత్తన శుద్ధి వల్ల మొలకెత్తే విత్తనాలను లేత మొక్కలను నేల ద్వారా సంక్రమించే శిలీంధ్రాల నుంచి కాపాడవచ్చని ఆయన అన్నారు. తక్కువ ఖర్చుతో తెగుళ్లు, పురుగులను అదుపులో ఉంచవచ్చన్నారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రాము, అనూరాధ, రైతులు పాల్గొన్నారు.

వాచ్‌మన్ మృతి

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 17: ఆత్మకూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వాచ్‌మెన్ గుండె నొప్పితో మృతి చెందారు. వివరాలివీ.. ఆత్మకూరు పట్టణంలోని ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఉదయం నుంచి వాచ్‌మన్ కె.శ్రీనివాసులు (55) విధుల్లోనే ఉన్నాడు. కాగా రాత్రి గెస్ట్ హౌస్‌కు తాళాలు వేసి అక్కడే గేట్ వద్ద ఒక్క సారిగా గుండె నొప్పితో కుప్పకూలి పోయారని స్థానికులు తెలిపారు. ఈ మేరకు స్పందించిన అక్కడి స్థానికులు ఈ విషయాన్ని గమనించి ఓ ఆటోలో వాచ్‌మన్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసులు మృతి చెందారు. శ్రీనివాసులుకు మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

నిందితుల అరెస్టు

ఆత్మకూరు, ఆగస్టు 17: ఆత్మకూరు పట్టణ శివార్లలోని అగ్నిమాపక కేంద్రం పక్కనే ఉన్న తాగునీటి బావిలో ఆత్మహత్య చేసుకున్న షేక్ వాహిద్(17) మృతికి గల కారకులను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేటకు సంబంధించిన షేక్ అజ్మతుల్లా కుమారుడైన షేక్ వాహిద్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతను ఓ యువతితో సన్నిహితంగా ఉండటాన్ని ఆ యువతీ సమీప బంధువైన (పెదనాన్న కుమారుడు) పఠాన్ ఇంతియాజ్ ఖాన్ తెలుసుకున్నాడు. అదేవిధంగా సుమారు నెలక్రితం ఆ యువతీ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో వాహిద్ బాషా ఆమె మాట్లాడటాన్ని ఇంతియాజ్ మరోసారి గమనించాడు. ఇంకోసారి తమ ఇంటివైపు రావద్దని గట్టిగా హెచ్చరించాడు. అయినప్పటికీ వాహిద్ బాషా ఆ యువతి ఇంటివైపు తరుచూ వస్తుండటంతో జీర్ణించుకోలేని ఇంతియాజ్ తన స్నేహితులైన మదార్‌వలి అలియాస్ అల్తాఫ్, ముర్తుజావలి అలియాస్ వలి, పల్లపు బిక్రమ్ అలియాస్ విక్రమ్‌లతో కలిసి ఈ నెల 13వ తేదిన యువకున్ని కిడ్నాప్ చేసి కొత్తపల్లి రస్తాలో గల విజయ పాలడైరీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వాహిద్‌బాషా కాళ్లు, చేతులు కట్టేసి ఆ తర్వాత అతని బట్టలు విప్పి డ్రాయర్ ఉంచి అవమానపరిచారు. అంతేకాదు ఈదృశ్యాన్ని వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించారు.అవమానాన్ని తట్టుకోలేక వాహిద్‌బాషా అగ్నిమాపక కేంద్రం పక్కనే ఉన్న మంచినీళ్ల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 15న ఆయన మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. వాహిద్‌బాషా మృతికి కారకులైన నలుగురిని కరివేన-నల్లకాల్వ రస్తాలో అరెస్టు చేశారు. అలాగే వారిపై బీఎన్ఎస్ 137(2), రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా నిందితులను కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

ఎస్ఎంసీ చైర్మన్ మృతి

పాణ్యం, ఆగస్టు 17: మండలంలోని కొనిదేడు జడ్పీ హైస్కూల్ కమిటీ చైర్మన్ గౌరీప్రసాద్(43) అనారోగ్యంతో మృతి చెందినట్లు టీడీపీ మాజీ మండల కన్వీనర్ రామపుల్లారెడ్డి తెలిపారు. శనివారం గౌరీప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గౌరీప్రసాద్‌కు భార్య లక్ష్మీలీలావతి, కూతురు, కుమారుడు ఉన్నారు. గౌరీప్రసాద్ కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. పాఠశాల హెచ్ఎం రసూల్‌ఖాన్. ఉపాధ్యాయులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరిపాలు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యపై నిరసనలు

- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు
- హంతకులను శిక్షించాలని నాయకుల డిమాండ్



పాణ్యంలో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

నందికొట్కూరు, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ వైద్యులు, విద్యార్థి సంఘాల నాయకులు శనివారం నిరసనలు చేపట్టారు. దోషులను వెంటనే పట్టుకొని శిక్షించాలని నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యులు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మీనాక్షిదేవి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో జూనియర్ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారం నిర్వహించారు. పీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది ఆధ్వర్యంలో నిర్వహించారు. జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రాంబాబు, గైనకాలజీ స్పెషలిస్టు రాజలక్ష్మి, అల్వాల హాస్పిటల్ గురువయ్య, గ్రామీణ వైద్యురాలు మీనాక్షి, జనతా హాస్పిటల్ డా.జహీర్, వైద్యశాల హెడ్ నర్సు భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు కొత్తబస్టాండు నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. చిన్నపిల్లల వైద్యుడు డా.సుబ్బారెడ్డి, జిల్లా నందికొట్కూరు గ్రామీణ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డా.ఎండీ కుమార్, డా.వనజ, డా.నిర్మల, డా.శ్రీనివాసులు, డా.మల్లయ్య, డా.ఎండీ మహ్మద్, డా.అనురాధ, డా.మీనాక్షి, డా.ఎం.ఎం.బాషా పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు ప్రధాన రహదారి వెంబడి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ జగన్‌మోహన్‌కు, తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తిరుపతి, వైద్యులు భరత్‌కుమార్, శారద, సాయి సుధా, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ, నర్సింగ్ ఆఫీసర్ ముర్తుజావలి, ప్రశాంతి, సూర్యం, యమున, శ్రీజ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా నగరంలో గల ఆర్‌జీకర్ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు తలపెట్టిన నిరసనలకు ఆత్మకూరు పీడీఎస్‌యూ తరుపున శనివారం ఆత్మకూరు పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే గౌడ్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా మాట్లాడుతూ.. వైద్యురాలిని హతమార్చిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిధులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఆర్ఎంపీ డాక్టర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ వైద్యులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు చింతలయ్య, సలాం, నగేష్, వెంకటేశ్వర్లు, మగ్బూల్‌బాషా ఉన్నారు.

● కోల్‌కతా నగరంలో గల ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రం సూపరింటెడెంట్ డాక్టర్ రాయుడు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం వైద్యురాలి హత్యను నిరసిస్తూ స్థానిక వైద్యశాలలోని వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యులు కవిత, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, సిబ్బంది వసంతమ్మ, సరోజినీదేవీ, సుజాత, శివ, రమేష్, అంజలి, జబివుల్లా తదితరులు ఉన్నారు. కాగా మెడికల్ షాపుల వారు తమ షాపులను బంద్ చేసి వైద్యుల నిరసనలకు సంఘీభావం తెలిపారు. అదేవిధంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా అత్యవసర సేవలు మినహా ఇతర సేవలను నిలిపివేశారు.

వెలుగోడు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్య చేసిన వారిని శిక్షించాలని వెలుగోడు సామాజిక ఆసుపత్రి వైద్యాధికారులు విక్రమ్‌అలీఖాన్, సాయి ప్రదీప్ అమూల్య, సులోచన డిమాండ్ చేశారు. అత్యవసర సేవలను మినహాయించి ఓపీని బంద్ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలిపి అనంతరం ర్యాలీగా ప్రధాన సెంటరుకు చేరుకున్నారు. అక్కడ మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమానికి గ్రామీణ వైద్యులు, వెలుగోడు సర్పంచ్ జయపాల్ జనసేన నాయకులు షాలు బాషా, తమ మద్దతు ప్రకటించారు.

● వెలుగోడు పట్టణంలో శనివారం రాత్రి గ్రామీణ వైద్యులు, కూటమి నాయలు క్యాండిల్ ర్యాలీ నిర్వహించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెలుగోడు ప్రధాన సెంటరులో కొవ్వొత్తులతో మానవ హారంగా నిలిచి ఘనంగా నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు జాకీర్ హుసేన్, ఖలీల్ పురుషోత్తం గౌడ్, జనసేన నాయకులు షాలు బాషా, తిరుపాల్ నాయక్, సుకన్య, బీజెపి నాయకులు ప్రతాప్ ఆచారి, నాగేశ్వరరావు, గ్రామీణ వైద్యులు లింగారెడ్డి, శివరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, మునిరుద్దీన్ నాగశేషులు రాజప్ప పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసి, అతికిరాతకంగా హత్య చేయటం దారుణమని డాక్టర్లు భావనరెడ్డి, కిరణ్‌కుమార్ అన్నారు. బండిఆత్మకూరు, నారాయణాపురం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. బండిఆత్మకూరులో తహసీల్దార్ ఆల్ఫ్రెడ్‌కు వినతి పత్రం అందజేశారు. వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పాణ్యం: కోల్‌కతాలో జరిగిన పీజీ వైద్య విద్యార్థిని హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రోహేలా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బస్టాండు కూడలిలో సీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. హాస్పిటల్ నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. వైద్యులు డాక్టర్ మునిస్వామి, డాక్టర్ సుమిల్, డాక్టర్ చంద్రప్రకాష్, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● వైద్య విద్యార్థులు, వైద్యులకు భద్రత కల్పించాలని స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రాస్తారోకో నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా మహిళలకు సరైన రక్షణ లేదని ప్రజాసంఘాల నాయకులు ప్రతాప్, శివకృష్ణ, వెంకటాద్రి, రాజు, మహేష్, నవీన్, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

కొత్తపల్లి, ఆగస్టు 17: మండలంలోని చిన్నగుమ్మడాపురం ఎంపీయూపీ పాఠశాల, ముసలిమడుగు ఉర్దూ పాఠశాలలో ఈ నెల 8న జరగాల్సిన స్కూల్ కమిటీ ఎన్నికలు వివిధ కారణాల వల్ల వాయిదా పడ్డాయి. దీంతో వాయిదా పడ్డ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను శనివారం ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం నాయక్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు రామకృష్ణయ్య, రుక్సానాల పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. చిన్నగుమ్మడాపురం ఎంపీయూపీ పాఠశాలలో విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా ఎస్.రాణి, వైస్ చైర్మన్‌గా ఎస్.ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముసలిమడుగు ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా షేక్ మాసూంబాషా, వైస్ చైర్మన్‌గా సయ్యద్ ముబీనా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులు రామకృష్ణారెడ్డి, ఏఎస్ రాజు, కృష్ణుడు, రాఘవేంద్ర, రవీంద్రబాబు, మన్సూర్‌బాషా, రహీంఖాన్, షఫీవుల్లా, ఇద్రుస్ బాషా, గఫూర్, సయ్యద్ సలీం, భీమా నాయక్ తదితరులు ఉన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రెండో సారి నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు కోరం లేక మరోసారి వాయిదా పడినట్లు ఎంఈవో సుబాన్, హెచ్ఎం మధుసూదన్ రావు తెలిపారు. ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌గా నరసింహులు, వైస్ పర్సన్‌గా సుజాత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, ఎల్లయ్య , శ్రీను తదితరులు ఉన్నారు.

గోస్పాడు: మండలంలోని ఎం.కృష్ణాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 8వ తేదీన జరగాల్సిన విద్యా కమిటీ ఎన్నిక వాయిదా పడటంతో శనివారం నిర్వహించారు. విద్యా కమిటీ చైర్మన్‌గా షేక్ మదార్‌వలి, వైస్ చైర్ పర్సన్‌గా బేతి శిరోమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాలీశ్వరరెడ్డి, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని వండుట్ల, ఆళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఈనెల 8వ తేదీ కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికలను శనివారం నిర్వహించినట్లు ఎంఈవో విమల వసుంధరాదేవి తెలిపారు. వండుట్ల ప్రాథమిక పాఠశాలలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఆళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. వండుట్ల ప్రాథమిక పాఠశాలలో ఎన్నికైన చైర్మన్ రాంపురం రాజు, వైస్ చైర్‌పర్సన్ రాజేశ్వరిని, ఆళ్లగడ్డ ప్రాథమిక పాఠశాలలో చైర్ పర్సన్‌గా గెలుపొందిన అలగనూరు సుధారాణి, వైస్ చైర్మన్ నీలి రామచంద్రుడులను ఆయా పాఠశాలల హెచ్ఎం ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ కో-ఆప్షన్ మెంబర్ రఫిక్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, వండుట్ల సర్పంచ్ గంగాధర్‌రెడ్డి అభినందించారు.

'సమస్యలు చెప్పాలి'

బండిఆత్మకూరు, ఆగస్టు 17: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశం దృష్టికి తేవాలని మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి సూచించారు. శనివారం బండిత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో వాసుదేవగుప్తా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమస్యలు తెలియజేస్తే ప్రాధాన్యాన్ని బట్టి మండల పరిషత్ నిధులను ఖర్చు చేస్తామన్నారు. అధికారులు అప్రమత్తంగా పని చేయాలని, ఏవైనా సత్ఫలితాలు రావాలంటే అధికారుల కృషి ఉండాలని అన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని సభలో వివరించారు. సమావేశంలో తహసీల్దార్ ఆల్ఫ్రెడ్, ఏఈలు లక్ష్మీనరసింహ, వెంకటయ్య, డాక్టర్లు భావనరెడ్డి, అనూష, ఏపీవో వసుధ, ఏవో స్వాతి, సూపర్‌వైజర్ రమాదేవి, ఏవో హనీఫ్‌ఖాన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

'స్వామిరెడ్డి ఆశయ సాధనకు ఉద్యమించాలి'

నందికొట్కూరు, ఆగస్టు 17: భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుల్లో ఒకరు, స్వాతంత్ర్య సమరయోధుడు, సోషలిస్టు వ్యవస్థాపన కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రజా నాయకుడు యాలూరి స్వామి రెడ్డి అని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన యాలూరి స్వామిరెడ్డి 43వ వర్ధంతి సభను నిర్వహించారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణ పోరాట కమిటీ అధ్యక్షుడు వేణుగోపాలరావు, శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగుల సంఘం మాజీ జిల్లా కార్యదర్శి గుంపుల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, రమేష్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రజితమ్మ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి: డీఈవో



పోస్టరును ఆవిష్కరిస్తున్న డీఈవో

పాణ్యం, ఆగస్టు 17: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న గణిత సబ్జెక్టు అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యం పెంచే పాఠ్యాంశాలను బోధించాలన్నారు. గణిత సముదాయ సమావేశంలో ఉపాధ్యాయినితో గణిత సమస్యను పరిష్కరించి వివరించడాన్ని పరిశీలించారు. ఓపెన్ స్కూల్ సొసైటీ ఓరియంటేషన్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. 14 సంవత్సరాలు నిండిన పిల్లలకు పదో తరగతి, 15 సంవత్సరాలు నిండిన పిల్లలకు ఇంటర్‌మీడియట్ కోర్సులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కోటయ్య సుబ్రహ్మణ్యం, హెచ్ఎం మేరీసునీత, సార్వత్రిక విద్యాపీఠం జిల్లా సమన్వయ కర్త లక్ష్మీనారాయణ, ఆర్పీలు మునిరాజు, సుజాత పాల్గొన్నారు.

'జీవో నెంబరు 117ను రద్దు చేయాలి'



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు నరసింహారెడ్డి

గోస్పాడు, ఆగస్టు 17: ప్రాథమిక విద్యకు గొడ్డలిపెట్టులా ఉన్న జీవో నెంబరు 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ నాయకుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. గోస్పాడులో శనివారం జరిగిన పీఆర్‌టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక విద్య బలోపేతం కావాలంటే జీవో నంబరు 117ను రద్దు చేసి 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే కలపాలని అన్నారు. పదోన్నతులు తరువాత సర్దుబాటు చేయాలని, ఈ నెల 31 వతేదీ పదవీ విరమణ ఉన్న పాఠశాలల్లో ఎంపీఎస్‌లను సర్దుబాటు నుంచి మినహాయించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలలో జీవో నంబరు 60 ప్రకారం పాఠశాల సహాయకులను కేటాయించాలని అన్నారు. పీఆర్‌టీయూ నాయకులు విజయరావు, శ్రీనివాసులు, సురేష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తాం: ఎంపీ



లక్ష్మీరంగనాథ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీ శబరి

జూపాడుబంగ్లా, ఆగస్టు 17: కూటమి ప్రభుత్వం హయాంలో ప్రతి గ్రామాన్ని సమానంగా అభివృద్ధి చేస్తామని నంద్యాల జిల్లా అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్, ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. మండలంలోని తర్తూరు లక్ష్మీరంగనాథస్వామిని శనివారం దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు ఆలయ అధికారులు మేళాతాళాలతోపాటు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి 101 టెంకాయలతో మొక్కు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ శబరికి ఆలయ అధికారులు పట్టుచీర, దుశ్వాలువాతో సత్కరించారు. ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులను తీసుకొచ్చి ప్రతిపైసాను అభివృద్ధికి కేటాయిస్తామని అన్నారు. 40రకాల శాఖల ద్వారా వచ్చే నిధులను జిల్లాకు తీసుకొచ్చి అధికారులతో సమీక్షా నిర్వహించి అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రధానంగా గ్రామాల్లో తాగునీటి, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కాకరవాడ చిన్నవెంకటస్వామి, కర్ణాకర్‌రెడ్డి, శివానందరెడ్డి, సైఫుద్దీన్, శివానందరెడ్డి, గోవిందు, గుణశేఖర్‌రెడ్డి, మాణిక్యరాజు, రాంబాబు, రమణ, శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

పాములపాడు, ఆగస్టు 17: వివిధ రకాల పోస్టల్ పథకాలపై పోస్టుమాస్టర్ మనోజ్‌కుమార్ పొదుపు మహిళలకు అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాములపాడులో శనివారం వెలుగు కార్యలయంలో ఏపీఎం అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాటా్లడుతూ ఆర్‌డీ, ఎస్ఎస్ఏ, ఆర్‌పిఎల్‌ఐ లాంటి చాల పథకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిద్వారా కష్టమర్లకు మంచి లాభాలు భద్రత ఉంటుందని ఈ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్‌వో, బీవో సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

శ్రీశైలం, ఆగస్టు 17: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం కర్నూలుకు చెందిన నాగమల్లేశ్వరి బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆనంద నాట్యగణపతిం, శివ శివ శంకర, శివతాండవం, కాలభైరవాష్టకం, ఓం నమఃశివాయా, తాండవ నృత్యకరి తదితర గీతాలకు హిమబిందు, లాస్య, వేదశ్రీ, ప్రణవి, వైనవి, వర్షిణి, సాహిత్య, మనస్వి, నవ్యశ్రీ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. అలాగే రెండవ కార్యక్రమంలో వెంకటేశ్వర సంగీత నృత్య కళానిలయం, కర్నూలు బృందంతో భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

'మానవ సంబంధాల విలువ తెలుసుకోవాలి'

పాణ్యం, ఆగస్టు 17: విద్యార్థులు మానవ సంబంధాల విలువలు తెలుసుకోవాలని ప్రముఖ గజల్ విద్వాంసుడు మహమ్మద్‌మియా అన్నారు. మానవ సంబంధాలు పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి తన గజల్స్ ద్వారా విద్యార్థి దశలో మానవ సంబంధాల ప్రాముఖ్యత, సమాజం పట్ల బాధ్యత, అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మానవ సంబంధాలను తెలుసుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సమన్వయకర్త రాజశేఖర్, అధ్యాపకులు లావణ్య, శిరీష, సల్మామరియా, విద్యార్థులు పాల్గొన్నారు.

మహానంది ఎస్ఐగా రామ్మోహన్‌రెడ్డి బాధ్యతలు

మహానంది, ఆగస్టు 17: మహానంది మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా రామ్మోహన్‌రెడ్డి శనివారం పదవి బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఆయన మహానంది ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పోలీస్‌స్టేషన్ చేరుకొన్నారు. వెలుగోడు ఎస్ఐగా ఉన్నతాధికార్లు బదిలీ చెయ్యడంతో అక్కడ విధుల్లో చేరకుండానే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా మహానంది ఎస్‌గా నియమించారు. మండలంలో శాంతి భద్రతలకు కాపాడేందుకు కృషి చేస్తానని ఎస్ఐ చెప్పారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

పాణ్యం, ఆగస్టు 18: ఈ నెల 11వ తేదీన పాణ్యం వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడు సాగర్‌ను శనివారం తమ్మరాజుపల్లె సమీపంలోని రాజస్థాన్ డాబా వద్ద అరెస్టు చేసినట్లు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి పత్రికా ప్రకటనలో ఆయన వివరాలు తెలిపారు. ఈనెల 11 వతేదీన కర్ణాటక రాష్ట్రం, హుబ్లీ కనకపుర తాలుకా హోమినగల్లి గ్రామానికి చెందిన శ్యామ్, అనంతపురం జిల్లా గుంతకల్లు అంకాలమ్మ గుడికవీధికి చెందిన గోసంగి సాగర్ దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. వీరితో పాటు రెహమాన్, మహమ్మద్ బాషా, ఆటో మస్తాన్, సలీం, ఇలియాజ్ బ్యాచిగా ఏర్పడి దొంగతనాలు చేస్తున్నారని తెలిపారు. వీరిపై గతంలో చిత్తూరు, కర్నూలు, కర్ణాటక, తదితర ప్రాంతాలలో కేసులు నమోదదైనట్లు తెలిపారు. కాగా దర్యాప్తులో భాగంగా శనివారం తమ్మరాజుపల్లె వద్ద గల రాజస్థాన్ డాబా వద్ద నిందితుడు సాగర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. శ్యామ్ తన కుటుంబాన్ని చిన్నాభిన్నం చేశాడని, దీంతో మనసులో ఉంచుకొని సాగర్ 11వ తేదీన పాణ్యం ఎస్సార్బీసీ సమీపంలోకి తీసుకొని వెళ్లి మద్యం తాపించి తుపాకీతో ఎడమ కణతిపై కాల్చి అనంతరం కత్తితో గొంతుపై పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైకు, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పాణ్యం ఎస్ఐ అశోక్, సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, నరేంద్రకుమార్ రెడ్డిలను ఎస్పీ అభినందించారని చెప్పారు. మీడియా సమక్షంలో వివరాలు వెల్లడించకుండా ప్రెస్ నోట్‌ను వాట్సాప్ గ్రూపులో పెట్టారు. అయితే తుపాకీకి సంబంధించిన పూర్తి వివరాలు లేకుండానే హడావిడిగా అరెస్టు చేయడంపై అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. హత్యకు ఉపయోగించిన తుపాకీని నిందితుడు సమీప ఎస్సార్బీసీలో పడవేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకోసం జలవనరుల శాఖ అధికారుల అనుమతితో కెనాల్‌లో నీటిని తగ్గించి స్థానిక జాలరులతో తుపాకీకోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదయ్యే సమయానికి ఎస్ఐ, సీఐ లు బదిలీ అయ్యారు. అయితే హడావుడిగా కేసు దర్యాప్తు పూర్తి చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

పాములపాడు, ఆగస్టు 17: మండలంలోని రైతుల పంటపొలాల వ్యవసాయానికి సంబంధించి రైతుల సంబంధించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు చేసినట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ అబ్దుల్ అబీద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు సరఫరా చేసే 9గంటల విద్యుత్ వేళలు కంబాలపల్లి, మిట్టకందాల, ఎర్రగూడూరు, వేంపెంట ఫీడర్‌కు సంబంధించి తెల్లవారురుఝామున 4 గంటల నుంచి ఉదయం 11 వరకు గ్రూప్ఏ ఏడు గంటలు అదే ఫీడర్‌లో రాత్రి 9 గంటల నుంచి 11 వరకు రెండు గంటలు మొత్తం 9 గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అలాగే చెలిమిళ్ళ రుద్రవరం, దుద్యాల, బానుముక్కల ఫీడర్‌లలో ఉదయం 11 గంల నుండి సాయంత్రం 6గంటల వరకు తిరిగి రాత్రి 9 నుంచి 11 వరకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని, రైతులు గమనించాలని తెలిపారు.

నందీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, ఆగస్టు 17: శ్రీశైల క్షేత్రంలో శనివారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోష కాలంలో ఆలయంలోని మల్లికార్జునస్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతికి పూజలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతో, కుంకుమోదకం, హరిద్రోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం, మల్లికార్జున గుండంలోని శుద్ధజలాలతో అభిషేకం నిర్వహించి అనంతరం అన్నాభిషేకం జరిపారు. అనంతరం నందీశ్వరస్వామికి నూతన వస్త్రసమర్పణ, విశేష అర్చనలు జరిపి, నానబెట్టిన శనగలను సమర్పించారు. తరువాత స్వామికి నివేదన సమర్పించారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో పూజలలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. భక్తులు ఈ పరోక్షసేవలో పాల్గొనేందుకు దేవస్థానం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ ద్వారా ఒక్కొపూజకు రూ. 1,116 సేవారుసుమును చెల్లించి పాల్గొనవచ్చును. సేవాకర్తలే కాకుండా, భక్తులందరూ కూడా నందీశ్వరస్వామి ఆర్జిత పరోక్షసేవ పూజా కార్యక్రమాన్ని శ్రీశైల టీవీ లేదా యూట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తురాలికి విరాళం రశీదును అందజేస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలం, ఆగస్టు 17: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్న ప్రసాద పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన సంపంగి మాధురి అనే భక్తురాలు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత ఈ విరాళాన్ని పర్యవేక్షకురాలు స్వర్ణలతకు అందజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

ఐఈఈఈ సొసైటీలు ప్రారంభం

పాణ్యం, ఆగస్టు 17: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కొత్తగా నాలుగు కొత్తగా ఐఈఈఈ సొసైటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం మట్లాడుతూ ఆసియా ఆర్ 10 రీజియన్ లోని ఐఈఈఈ హైదరాబాదు సెక్షన్ కింద సొసైటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమ్యూనికేషన్ సొసైటీ, మైక్రోవేవ్ థియరీ అండ్ టెక్నాలజీ సొసైటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ సొసైటీ, కంప్యూటర్ సొసైటీలను ప్రారంభించినట్లు తెలిపారు. ఐఈఈఈ హైదరాబాదు సెక్షన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయలత, చైర్మన్ డాక్టర్ జయప్రకాశన్, కోశాధికారి డాక్టర్ మహేష్, అనంతపురం సెక్షన్ సాక్ చైర్మన్ డాక్టర్ శంకర్, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్‌విజయకృష్ణ, పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు



కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 17: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం శ్రావణమాస పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సీతారాములు, ఆంజనేయస్వామికి జల, క్షీరాభిషేకాలు చేశారు. ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానిదేవి ఆధ్వర్యంలో సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని, దీపోత్సవం చేశారు. సీతారాముల పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వాములను పల్లకిలో కొలువుదీరింప చేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి రామ్మోహన్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వినాయక చవితిని విజయవంతంగా నిర్వహిద్దాం

డోన్, ఆగస్టు 17: వినాయక చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిద్దామని డోన్ గణేష్ కమిటీ అధ్యక్షుడు కోట్రికే ఫణిరాజ్, సంధు వెంకటరమణ అన్నారు. శనివారం పట్టణంలోని వినాయక గుడిలో కమిటీ సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో జరిగే వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు ప్రజలు సహకరించాలని కోట్రికే ఫణిరాజ్ కోరారు. నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజయవంతంగా పూర్తి చేద్దామన్నారు. గణేష్ కమిటీ కార్యదర్శి హనుమంతరెడ్డి, కోశాధికారి కందుకూరి పార్థసారథి, రామకృష్ణ, శ్రీరామ్, రాజేష్, ఈశ్వర్ నాయుడు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ఫోర్జరీపై కేసు నమోదు

శివవరంలో వైసీపీ నాయకుడి దుశ్చర్య

అవుకు, ఆగస్టు 17: అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన వ్యాపర్ల చిన్న సుబ్బారెడ్డి, గుత్తి లలితపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ రాజారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చిన్న సుబ్బారెడ్డి, గుత్తి లలిత రెవెన్యూ రికార్డులను ఫోర్జరీ చేసి శివవరం గ్రామంలోని సర్వే నెంబరు 631లోని మూడు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి గుత్తి లలిత పేరుతో దొంగ పట్టాను సృష్టించారు. గతంలో ఎస్సీ కాలనీలోని ఆ స్థలంలో గ్రామానికి చెందిన మహిళల సామూహిక మరుగుదొడ్డి ఉండేది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకుడు చిన్న సుబ్బారెడ్డి అండతో గుత్తి లలిత మరుగుదొడ్డిని కూల్చివేసి ఏకంగా ఇంటిని నిర్మించాడు. అవుకు రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ రెవెన్యూ రికార్డులు ఫోర్జరీ జరిగినట్లు ఫిర్యాదు చేయటంతో ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి రెండు ఆవులు మృతి

కోవెలకుంట్ల, ఆగస్టు 17: విద్యుత్ తీగలు తగిలి రెండు ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన కోవెలకుంట్ల పట్టణంలోని యాక్సిస్ బ్యాంకు పక్కనే ఉన్న సందులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండు నుండి ముదిగేడు సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న యాక్సిస్ బ్యాంకుకు పక్కలో చిన్నపాటి సందు ఉంది. ఈ సందు గుండా ప్రజలతో పాటు పశువులు తిరుగుతుంటాయి. అయితే శనివారం రాత్రి విద్యుత్ అర్త్ వైరు కిందికి వేలాడుతుండడంతో అటు వైపుగా వస్తున్న రెండు ఆవులు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి.

మద్యం స్వాధీనం

బేతంచెర్ల, ఆగస్టు 17: మండలంలోని ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన గురుమూర్తి కుమారుడు కుమ్మరి బాలరాజు శనివారం గ్రామ పీర్ల చావిడి వద్ద అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా.. ఏఎస్ఐ లింగమయ్య తన సిబ్బందితో దాడులు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి 14 క్వార్టరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

● పట్టణంలో బోయపేట చెందిన మిద్దె పాపన్న నాటుసారా బట్టిని, 300 లీటర్ల బెల్లం ఊట, 25 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మాసూం తెలిపారు. శనివారం సుబ్బారెడ్డి నగర్ సమీపంలో కొండల్లో నాటుసారా విక్రయిస్తున్నారన్న సమచారం మేరకు దాడులు చేసి నింది తున్ని అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

పెట్నికోట మీదుగా తాడిపత్రికి కొత్త సర్వీసు

బనగానపల్లె, ఆగస్టు 17: బనగానపల్లె పట్టణం నుంచి అవుకు, కొలిమిగుండ్ల, పెట్నికోట, గొర్విమానుపల్లె, తుమ్మల పెంట మీదుగా కొత్త సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజరు కిశోర్‌కుమార్ శనివారం తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో ఈ బస్సు సర్వీను ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు డిపో మేనేజరు తెలిపారు. బనగానపల్లెలో ఉదయం 7:30 గంటలకు బయలు దేరి 9:45 తాడిపత్రి చేరుకుంటుందని తెలిపారు. తాడిపత్రి నుంచి తిరిగి 10 గంటలకు బయలుదేరి బనగానపల్లెకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు బనగానపల్లె నుంచి బయలు దేరి తాడిపత్రికి 3:15 గంటలకు చేరుతుకుంటుందని తెలిపారు. తాడిపత్రిలో 3:30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.45 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు కొత్త సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి'



వరినాట్లు వేస్తున్న రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు

రుద్రవరం, ఆగస్టు 17: విద్యార్థి దశలోనే వ్యవసాయంపై అవగాహన తప్పనిసరి అని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాళ్లు లక్ష్మీదేవి, నాగేశ్వరరావు అన్నారు. వృత్తి విద్యలో భాగంగా శనివారం కేజీబీవీ, ఆదర్శ పాఠశాల విద్యార్థులు పొలంబాట పట్టారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అధ్యయనం చేసి జీవిత పాఠం ఎలా ఉంటుందో విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు నాట్లు వేశారు. వ్యవసాయ క్షేత్రంలో పరిశోధనలు చేశారు. కార్యక్రమంలో ట్రైనర్ జ్యోతిప్రియ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఆగస్టు 17: మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో అనూరాధ శనివారం పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కాత్యాయని, సీఆర్పీ ఖాసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను తనిఖీ చేశారు. హెచ్ఎంలు కోటయ్య, విజయలక్ష్మి, సీఆర్పీలు అమీర్‌ఖాన్, ఖాసీం పాల్గొన్నారు.

'అసాంఘిక కార్యకలాపాలపై నిఘా'

రుద్రవరం, ఆగస్టు 17: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెడతామని ఎస్ఐ వర ప్రసాద్ అన్నారు. రుద్రవరం ఎస్ఐగా శనివారం ఆమర బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎప్పటికప్పుడు నిఘా పెట్టి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శోభన్‌బాబు ఉన్నారు.

వైద్యురాలి హత్యపై నిరసన

డోన్(రూరల్), ఆగస్టు 17: కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యపై డోన్ ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. కొత్తబస్టాండు ప్రధాన రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నుంచి పాతబస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండులో ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు గైనకాలజిస్టులు డా.సుంకన్న, యశోద, దీపిక, బాలచంద్రారెడ్డి, రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర వైద్యులు, వైద్యసిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మహిళా సమాఖ్య నాయకులు షమీమ్ బేగం, బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు విజయభాస్కర్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శివన్న, ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు తెలుగు విజయకుమార్, తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి : కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డోన్ టీడీపీ పట్టణ యువ నాయ కుడు హనుమంతరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ మహిళలపై అత్యాచార ఘటనలు జరగకుండా ఉండేందుకు దేశ వ్యాప్తంగా కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు.



ఆళ్లగడ్డలో..

సంజామల: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను శిక్షించాలని సంజామల పీహెచ్‌సీ డాక్టర్ క్రిష్ణ కుమారి డిమాండ్ చేశారు. శనివారం ఉదయం నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత పోలీసు టీడీపీ కార్యాలయం ఎదురుగా మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ పురుషోత్తం, వైద్య, ఆరోగ్య సిబ్బంది కస్తూర్బా, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనగానపల్లె: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు, వైద్య సిబ్బంది బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ సుజాతమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వ వైద్యులు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవుకు: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అవుకు వైద్యుల బృందం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు యమున, నవీన్ అవుకు సామాజిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో వైద్యురాలి మృతికి సంతాపం తెలుపుతూ రాత్రి అవుకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో వైద్యులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కోల్‌కత్తాలో వైద్యురాలిని హత్యకు నిరసన ఆర్ఎస్ రంగాపురంలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, బేతంచెర్ల పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు వెంకటేశ్, అలీమ్, ఆర్ఎస్ రం గాపురం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యకు నిరసనగా కోవెలకుంట్ల పట్టణంలో డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోవెలకుంట్ల గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవహారం నిర్వహించి ధర్నా చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, హెడ్ నర్సు ఇంద్రావతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



డోన్‌లో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థినులు



బనగానపల్లెలో..

ఆళ్లగడ్డ: కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు నిరసనగా ఆళ్లగడ్డలో ప్రభుత్వ వైద్యులు అన్ని రకాల వైద్య సేవలను శనివారం నిలిపివేశారు. ఈ మేరకు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుజాతమ్మ ఆధ్వర్యంలో వైద్యుల, సిబ్బంది వైద్యశాల నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతి పత్రం అందించారు.

రుద్రవరం: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యురాలు గాయత్రి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ర్యాలీ చేసి నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే పేదల అభ్యున్నతి

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి

డోన్, ఆగస్టు 17: సీఎం చంద్రబాబుతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. వెనుకబడిన రాయలసీమ జిల్లాలను అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని వివరించారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులను ఆదుకునే లక్ష్యంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, కిష్టన్న, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాముడు, సర్పంచ్ రామిరెడ్డి, న్యాయవాది కృష్ణ ప్రసాద్, చక్రపాణి గౌడు, కాశీ, పెద్దకాంత్, కిరణ్ పాల్గొన్నారు.



భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

'రైతుల సమస్యలు పరిష్కరించాలి'



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మండల కన్వీనర్, నాయకులు

శిరివెళ్ల, ఆగస్టు 17: మండలంలోని గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి శిరివెళ్ల తహసీల్దార్ పుష్ప కుమారిని కోరారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పుష్ప కుమారిని టీడీపీ నాయకులతో కలిసి ఆయన శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువా, పూలమాలలతో తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరా రామ, మహమ్మద్ హుసేన్, మురళి, సూరా శ్రీనివాసులు, షేక్షా, హరి, రమేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగు లాభదాయకం



మెట్టుపల్లిలో ఆయిల్‌ఫాంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్యాపిలి, ఆగస్టు 17: ఆయిల్‌ఫాం సాగు లాభదాయకమని ఉద్యానవన అధికారి కళ్యాణి అన్నారు. శనివారం మండలంలోని మెట్టుప ల్లి గ్రామంలో ఆయిల్‌ఫాం సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ అయిల్‌ఫాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.29 వేలు రాయితీ కల్పిస్తుందన్నారు. అలాగే అంతర పంటలు సాగు చేస్తే మరో రూ.5500 రాయితీ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్వామిరెడ్డి సేవలు మరువలేనివి

బనగానపల్లె, ఆగస్టు 17: కమ్యూనిస్టు నాయకుడు యాలూరు స్వామిరెడ్డి సేవలు మరువలేనివని బనగానపల్లె సీపీఐ నాయకులు అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో స్వామిరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి సుబ్బా రెడ్డి, సంజీవులు, సోమన్న, శివబాలకృష్ణ, శివయ్య, శివనాగయ్య, మద్దిలేటి, సుబ్బయ్య, గంగన్న పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయించడం నేరం



దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల, ఆగస్టు 17: పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని లేబర్ ఆఫీసర్ శోభారాణి అన్నారు. శనివారం కొలిమిగుండ్లలో దుకాణాలు, నాపరాళ్ల పరిశ్రమల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా దుకాణాల్లో చిన్న పిల్లలు పని చేస్తున్నారా అన్న విషయంపై ఆరా తీశారు. ఐసీపీఎస్ కౌన్సిలర్ సునీల్‌కుమార్, డోన్ లేబర్ అధికారి నాగజ్యోతి, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

కోవెలకుంట్ల, ఆగస్టు 17: కోవెలకుంట్ల సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ హేమంత్ నాయక్ హెచ్చరించారు. శనివారం కోవెలకుంట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సర్కిల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు పేకాట గుట్టుగా నిర్వహిస్తుండేవారని, తమ దృష్టికి రావడంతో తనిఖీలు చేశామన్నారు.

అన్న క్యాంటీన్ పథకం నిరుపేదలకు వరం

కోవెలకుంట్ల, ఆగస్టు 17: అన్నక్యాంటీన్ పథకం నిరుపేదలకు వరమని మండల టీడీపీ యువ నాయకుడు డాక్టర్ పేర శ్రీధర్‌రెడ్డి అన్నా రు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం భ్రష్టు పట్టి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడం చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు.

పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం

శిరివెళ్ల, ఆగస్టు 17: మండలంలోని రెండు పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈవో డీటీ శంకర్ ప్రసాద్ శనివారం తెలిపారు. శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు వనికెందిన్నెలోని ప్రాథమికోన్నత పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికల్లో కోరం లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు వాయిదా వేసిన విషయం విధితమే. దీంతో ఆయా పాఠశాలల్లో శనివారం ఎన్నికల ప్రక్రియ చేపట్టగా చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో వెల్లడించారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

డోన్, ఆగస్టు 17: మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ కార్యకర్త మౌలీశ్వరరెడ్డి మృతికి శనివారం టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామికి వెండి ఆభరణాలు



వెండి ఆభరణాలు అందజేస్తున్న గంధం రాఘవరెడ్డి దంపతులు

రుద్రవరం, ఆగస్టు 17: రుద్రవరంలో కొలువుదీరిన కాశీవిశ్వేశ్వర ఆంజనేయ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామికి శనివారం గంధం రాఘవరెడ్డి, సావిత్రమ్మ దంపతులు మూడు కేజీల వెండి ఆభరణాలు ఆలయ కమిటీకి అందించారు. పద్మపీఠం, వెండి గొడుగు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆ దంపతులను శాలువాతో పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, మాలేశ్వరమ్మ, జ్యోత్స్న, యశస్విని, కమిటీ సభ్యులు లింగం సత్యం, నూకల కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, భువనగిరి కృష్ణ మూర్తి, కోనయ్య, లింగమల సురేశ్, టంగుటూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఆగస్టు 17: కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్‌ను శనివారం పట్టణానికి చెందిన టీడీపీ యువ నాయకుడు పెనుగొండ రాజశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకి రాజశేఖర్ పూలబొకే ఇచ్చి అభినందించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

'రైతులకు అందుబాటులో ఉండాలి'

చాగలమర్రి, ఆగస్టు 17: గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఏవో రంగనేతాజీ పేర్కొన్నారు. శనివారం చాగలమర్రిలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలను నమోదు చేయాలని అన్నారు. పంట పొలాల వద్దకు వెళ్లి రైతులచే పంట నమోదు చేయించాలని సూచించారు. ఏఈవోలు పాల్గొన్నారు.

దొర్నిపాడు డీటీగా మాధవ్ బాధ్యతలు

దొర్నిపాడు, ఆగస్టు 17: దొర్నిపాడు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా శనివారం ఆర్.మాధవ్ బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. బదిలీల్లో భాగంగా నంద్యాల కలెక్టర్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న మాధవ్ దొర్నిపాడుకు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కుందూలో 11 వేల క్యూసెక్కులు

చాగలమర్రి, ఆగస్టు 17: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 11 వేల క్యూసెక్కుల నీటితో కుందూ నది ప్రవహిస్తోందని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. శనివారం ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని కేసీ కాలువ ఆనకట్ట పరిస్థితిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీరు, చాపాడు చానల్‌కు వంద క్యూసెక్కుల నీరు విడుదల చేశామని అన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు. చివరి ఆయకట్టు వరకు నీరు ప్రవహించేలా చూస్తామని అన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

రుద్రవరం, ఆగస్టు 17: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవికి అర్చకులు వారణాసి గోపీశర్మ శివశర్మలు అభిషేకం చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకొని పూజలు చేశారు. నరసాపురం, రుద్రవరం గ్రామాల పరిధిలో కొలువుదీరిన లక్ష్మీనర సింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

డోన్‌లో వర్షం

డోన్(రూరల్), ఆగస్టు 17: మండలంలో శనివారం తెల్లవారుజామున వర్షం కురిసింది. మండలంలో 29 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు మండల వ్యవసాయాశాఖ అధికారి అబ్దుల్ షఫీ తెలిపారు. కొర్ర, సజ్జ పంటలకు ఈ వర్షం ఉపయోగకరమని ఆయన తెలిపారు.

పంటలపై పందుల దాడి



పందుల దాడిలో నాశనమైన పంట

కొలిమిగుండ్ల, ఆగస్టు 17 : ఊర పందుల దాడిలో మొక్క జొన్న పంట నాశనమైనట్లు గ్రామానికి చెందిన రైతులు వాపోయారు. గ్రామ సమీపంలో సాగర్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో సాగు చేసిన మొక్క జొన్న పంటలో శనివారం తెల్లవారు జామున పందులు చొరబడి నాశనం చేసినట్లు బాధితుడు వాపోయాడు. కొంత కాలంగా కొలిమిగుండ్లతో పాటు మండలంలోని పలు గ్రామాలలో పందుల బెడద తీవ్రంగా మారిందని, అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల బారి నుండి రక్షించాలని కోరుతున్నారు.

ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంఈవోలు

అవుకు, ఆగస్టు 17: ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవోలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులతో కలిసి ఓపెన్ అడ్మిషన్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఓపెన్ అడ్మిషన్‌ల ప్రక్రియను చేపట్టిందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన, వ్యక్తిగత కారణాలతో పాఠశాలలకు వెళ్లలేక పోయిన, గృహిణిలుగా ఉన్నటువంటి వారు ఓపెన్ విధానంతో చదువను కొనసాగించవచ్చన్నారు. వివరాలకు అవుకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించాలని కోరారు. చదువును మధ్యలో నిలిపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'



మాట్లాడుతున్న నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు శజ్జారెడ్డి

చాగలమర్రి, ఆగస్టు 17: రాష్ట్రంలో సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు శజ్జారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో యాజమాన్య కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా లక్ష్మీరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఓబులేసు ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు అభినందించారు. నాయకులు రమణారెడ్డి, కుమార్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.